తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## పురవీధుల్లో గౌరమ్మ దర్శనం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం సందర్భంగా గొబ్బెమ్మను పట్టణంలో ఊరేగించే సంప్రదాయం ఉంది. ఉదయం మొదటి కాలాభిషేకం తరువాత అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకార మండపంలోముస్తాబు చేసి బోయిలు మోసుకుంటూ శివయ్య గోపురంనుంచి రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ అమ్మవారిని పూజలు జరిపి సప్పరంలో ప్రతిష్టించారు. తరువాత ఉభయదారులు కాసరం బాలాజి వెంటరాగా గ్రామోత్సవం నాలుగుమాడ వీధుల్లో సాగింది. గ్రామోత్సవం తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధి, బజారువీదుల మీదుగా సాగింది. ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్సెపెక్టర్ హరియాదవ్ వారిసహాచరులున్నారు.

## కొండలదేవుడికి బంగారు ఆభరణాలు బహుకరణ

తిరుమల, డిసెంబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవేంకటేశ్వరస్వామికి కెవిఆర్ జ్యువలర్స్ అధినేతలు కెఆర్ నారాయణమూర్తి, కెఎన్ స్వర్ణగౌరి కుటుంబసభ్యులు 1.30కోట్ల రూపాయలు విలువైన 1756గ్రాముల బంగారు ఆభరణాలను వెంకన్నకు కానుకగా సమర్పించుకున్నారు. యజ్ఞోపవీతం, రాళ్ళు పొదిగిన మూడు పతకాలు కానుకగాఅందించారు.

"రెక్టార్" పదవికోసం

# ఆచార్యుల మధ్య పోటీ!

## -పరిశీలనలో పలువురి పేర్లు

## అమాత్యుని ఆశీస్సులెవరికో!?

ప్రభాతవార్త-తిరుపతి:



సరస్వతినిలయం....నాక్ ఏగ్రేడ్ సాధించిన తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రెక్టార్ పదవికోసం ఆచార్యుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ పదవిని అందుకునేందుకు పలువురు ఆచార్యులు ఖద్దరు నాయకుల ప్రసన్నంచేసుకుని వారి ఆశీస్సుల కోసం ప్రదక్షణలు చేస్తుండగా, ఏకంగా ఒకరు ఇద్దరు ఆచార్యులు ఓ అమాత్యుని ఆశీస్సులతో అందలం ఎక్కేందుకు విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారని విశ్వవిద్యాలయంలో చర్చ మొదలైంది. ప్రస్తుతం విశ్వవిద్యాలయం రెక్టార్‌గా ఉన్న వి.శ్రీకాంత్‌రెడ్డి ఈనెలాఖరుకు ఆచార్యులుగా కూడా పదవీవిరమణ చేయనున్నారు. ఆ స్థానం ఖాళీ కానుండటంతో విశ్వవిద్యాలయంలోని పలువురు ఆచార్యులు రెక్టార్ పదవికోసం ముందునుంచే ఎవరిస్థాయిలో వాళ్ళు విశ్వప్రయత్నాలు చేసుకుంటున్నారు. విశ్వవిద్యాలయాల్లో ఎంతో కీలకమైన రెక్టార్ పదవి ఏడాదికి మించి రెండేళ్ళు వరకు ఉంటుంది. ఎస్వీవిశ్వవిద్యాలయంతోబాటు పరిధిలోని కళాశాలలలో కీలకంగావిద్యాబోధన, పరిశోధన, డిగ్రీ కళాశాలలపై పర్యవేక్షణ రెక్టార్‌దే. విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బోధన, పరిశోధన, పరీక్షల నిర్వహణ, సకాలంలో ఫలితాల విడుదల, అనుబంధ కళాశాలల గుర్తింపు పనితీరు, నూతన విద్యావిధానాలుఅమలు మార్పులుచేర్పులు వంటి కీలకమైన బాధ్యతలు రెక్టార్ నిర్వహిస్తారు. విద్యాబోధనలో ఎలాంటి మచ్చ లేని, అవినీతి ఆరోపణలు లేని ,అనుభవజ్ఞులైన వివాదరహితుడి ఆచార్యుడిని నియమించుకోవాల్సి ఉంటుంది. విశ్వవిద్యాలయం ప్రతిష్టను ఇనుమడింపజేసేలా పలు అంశాలను దృష్టిలో ఉంచుకుని వర్సిటీ అకడమిక్ అంశాలపై అవగాహన,పట్టు కలిగి ఉండాలి. ఈ నేపధ్యంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నెలాఖరుకు ఖాళీ అవుతున్న రెక్టార్ పదవికోసంరెడ్డి సామాజిక వర్గం నుంచి ఎస్వీయూ సైన్స్‌కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.శ్రీనివాసులురెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యులు దామోదర్‌రెడ్డి, భానుదయరెడ్డి, మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి, ఎస్వీయూ ఆర్ట్సు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మనాభమ్, బిసి సామాజిక వర్గం నుంచి ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య జానకిరామయ్య, ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఆచార్య మురళి, సిడిసి డీన్ ,ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య అప్పారావు, ప్రస్తుత రిజిస్ట్రార్ ఓఎండి హుస్సేన్ కూడా బిసి సామాజిక వర్గం కావడంతోరెక్టార్ పోస్టుకు ఎన్నుకోదగిన వ్యక్తిగా విశ్వవిద్యాలయంలో చర్చ మొదలైంది. తక్కువ సమయంలో పదవీవిరమణ చేయనున్న వారికి అవకాశం తక్కువేనని చెప్పుకోవాలి. అయితే అనుభవం, నైపుణ్యం, ప్రావీణ్యత కంటే రాజకీయనేతల ప్రసన్నం, మంత్రుల అభయం ఉన్న ఆచార్యులు రెక్టార్ పదవి వరిస్తుందనిగుసగుసలు వినిపిస్తున్నాయి.

మృత్యుఘోషలోనూ

# అధికారం కోసం ఆరాటమే...!

### కందుకూరు ఘటనపై స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి
### -పల్లెబాటకు అనూహ్య స్పందన



చౌడేపల్లి, డిసెంబర్ 29 ప్రభాతవార్త

ఓవైపు మనుష్యులు మరణిస్తుంటే మరోవైపు సభ కొనసాగిస్తాననడం చంద్రబాబునాయుడు అధికారం కోసం పడే తపన ప్రజలకు అర్థమవుతోందని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పల్లెబాటలో కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలోని ఎ.కొత్తకోట, దుర్గసముద్రం, చారాల, శెట్టిపేట తదితర పంచాయతీల్లోని 40 గ్రామాల్లో మంత్రి పెద్దిరెడ్డి పర్యటించారు. కందుకూరు ఘటనపై ఆయన స్పందిస్తూ సొంతపార్టీ కార్యకర్తలు 8మంది మరణించి, మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలైతే అందరూ ఇక్కడే వున్నండి సభ కొనసాగిస్తామని చంద్రబాబు అనడం అతని అధికార దాహానికి పరాకాష్టగా ఆయన అభివర్ణించారు. ఇరుకైన సందుల్లో, చిన్న జంక్షన్లలో ఇలాంటి ఘటనలు జరిగే అవకాశం ఉందనీ, అలాంటి స్థలాల్లో సభలు సమావేశాలకు అనుమతి ఇవ్వకూడదని సీఎస్, డిజిపి, కలెక్టర్లకు మంత్రి సూచించారు. కందుకూర మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతిని వ్యక్తం చేసారు. 14యేళ్ళు ముఖ్యమంత్రిగా, ప్రతిపక్షనేతగా చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధికి చేసింది శూన్యమనీ, పుంగనూరు నియోజకవర్గంలో 30యేళ్ళుగా జరిగిన కుటుంబ పాలనలోనూ ఇదే జరిగిందన్నారు. వారు అభివృద్ధి చేసివుంటే ప్రస్తుతం కష్టపడేవాళ్ళం కాదన్నారు. చంద్రబాబునాయుడు, లోకేష్‌లు రాష్ట్రం ప్రజల సంక్షేమాన్ని విడచి అధికారం కోసం ఆరాటపడుతున్నారన్నారు. రోజుకు 10కిలోమీటర్లు నడిస్తే ఆరోగ్యవంతంగా వుంటాడని లోకేష్ పాదయాత్రపై ఆయన ఎద్దేవా చేసారు. పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డికి మండలంలో ఘనస్వాగతం లభించింది. ప్రజాసమస్యలను అక్కడిక్కడే పరిష్కరించడంతో జనం ఆయనకు నీరాజనాలు పలికారు. ఆర్‌బికేలతోపాటు వివిధ భవనాలను ఆయన ప్రజలకు అంకితం చేసారు. జడ్పీ ఛేర్మన్ జి.శ్రీనివాసులు, రాష్ట్ర ఆర్టీసీ ఉపాధ్యక్షుడు విజయానందరెడ్డి, జడ్పీ ఉపాధ్యక్షుడు ధనుంజయరెడ్డి, రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు, జడ్పీటీసీ ఎన్.దామోదర్‌రాజు, ఎంపిపి జి.రామ్మూర్తి, బోయకొండ ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణ, యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్, హెచ్‌డిఎస్ ఛేర్మన్ కళ్యాణ్‌భరత్, సింగిల్‌విండో ఛేర్మన్ రవిచంద్రారెడ్డి, తొండ శ్రీరాములు, సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష వేగవంతం చేయండి

### సి సి ఎల్ ఎ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్

తిరుపతిరూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష, రీ సర్వేని వేగవతం చేయాలని సి సి ఎల్ ఎ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం సిసిఎల్ఏ కార్యాలయం నుండి వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం (సమగ్ర సర్వే) కార్యచరణ అమలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టరేట్ నుండి జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ, డిఆర్వో శ్రీనివాసులు, ఏ.డి. జయరాజ్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫెరెన్స్‌లో సి.సి.ఎల్.ఏ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ శాశ్వత జగనన్న భూ హక్కు, భూ రక్ష పత్రాల పంపిణి కార్యక్రమాన్ని నిర్దేశించిన గడువులోపల పూర్తి చేయాలన్నారు. రీ సర్వేకు సంబంధించి మ్యుటేషన్ రీ కరెక్షన్, ట్రాన్సాక్షన్ తదితర అంశాలపై సమీక్షించారు. మ్యుటేషన్ కోసం అందిన ధరఖాస్తులను పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలన్నారు. వీడియో కాన్ఫెరెన్స్ అనంతరం జాయింట్ కలెక్టర్ డికె.బాలాజీ మాట్లాడుతూ వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పత్రాల పంపిణి వేగవంతం చేయాలన్నారు. మ్యుటేషన్ కోసం అందిన ధరఖాస్తులను పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

### విద్యతో సంస్కరణ తీసుకురావడమే
## ప్రభుత్వ లక్ష్యం
### మంత్రి ఆర్.కె.రోజా



విజయపురం, డిసెంబరు 29 ప్రభాతవార్త

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యలో సంస్కరణ తీసుకువచ్చి విద్యా విధానాన్ని ఉపయుక్తంగా మార్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. గురువారం మండలంలోని పన్నూరు ఉన్నత పాఠశాల ఆవరణలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షల్లో తట్టుకునే విధంగా బైజూస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని కంటెంట్‌ను ట్యాబ్‌లో అందిస్తున్నారని, ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలో విద్యా విధానం కార్పొరేట్ విద్యతో పోటీ పడుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిదో తరగతిలో 4,59,564 మంది విద్యార్థులకు 59,176 మంది ఉపాధ్యాయులకు కలిపి మొత్తం 5,19,740 మందికి ట్యాబ్‌లు పంపిణీ చేశామని తెలిపారు. ట్యాబ్ విలువ రూ. 688 కోట్లు, కంటెంట్ విలువ రూ. 778 కోట్లు మొత్తం రూ. 1,466 కోట్లు ఖర్చవుతోందన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ ఆంజనేయులు, ఎంపిడిఒ సతీష్, తహశీల్దారు అమరేంద్రబాబు, హెచ్ఎం శ్రీధర్‌రాజు, సిఎంఒ ఉదయలక్ష్మి, ఐఇఆర్‌టి జిల్లా సమన్వయకర్త ప్రభాకర్‌వర్మ, సర్పంచ్‌లు సునంద మనోహర్‌రెడ్డి, కుమార్, ఎన్ఎంసి ఛైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

# తృటిలో తప్పిన ప్రమాదం

### డ్రైవర్ సమయస్ఫూర్తితో ప్రయాణికులు సురక్షితం



రెడ్డేపల్లె సమీపంలో ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు, విరిగిన యాక్సిల్

వెదురుకుప్పం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :

డ్రైవర్ సమయస్ఫూర్తితో ప్రమాదం తప్పి ప్రయాణికులు సురక్షితంగా బయటపడిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు ... మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయితీ పరిధిలోని రెడ్డేపల్లె సమీపంలో చిత్తూరు రెండవ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు స్టీరింగ్ విరిగిపోవడంతో ప్రమాదం సంభవించింది. తృటిలో ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో స్టీరింగ్ విరిగిపోవడంతో డ్రైవర్ తెలివిగా బస్సు పల్టీపడకుండా మట్టికుప్పకు మళ్ళించడంతో బస్సు ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆర్టీసీ వారు బస్సులను తరచూ నిర్వహణ చేయవలసి ఉంది. ఆ పర్యవేక్షణ కొరవడంతో ప్రమాదంకు గురవుతున్నాయని బస్సుల సమర్థ్యంను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నడపాలని ప్రయాణికులు పెదవి విరిచారు. ఇకనైన ఆర్టీసీ సిబ్బంది గ్రామీణ ప్రాంతంలో, గుంతల మయమైన రహదారులలో నడిపే బస్సులను తరచూ పర్యవేక్షించి సామర్థ్యం మంచిగా ఉన్న బస్సులను నడపాలని డిమాండ్ చేశారు.

# తగ్గిన నేరాలు .. పెరిగిన భద్రత

### రాష్ట్ర విభజనతో అతిపెద్ద పోలీస్ జిల్లాగా తిరుపతి
### 26 గ్రామాలనుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దిన ఘనత మాదే
### పోలీస్ శాఖ వార్షిక నివేదిక విడుదల చేసిన ఎస్పీ పరమేశ్వర రెడ్డి



తిరుపతి క్రైం, డిసెంబర్ 29, ప్రభాతవార్త

2022 సంవత్సరంలో జిల్లా పోలీసు శాఖ సాధించిన ప్రగతి, చేధించిన కేసులు వివరాలను వెల్లడించేందుకు తిరుపతి ఫార్చ్యూన్ కెన్సెస్ హోటల్ నందు జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి గురువారం 29న వార్షిక మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం తిరుపతి అర్బన్‌గా ఉన్న మన జిల్లా ఈ సంవత్సరానికి 9 సబ్ డివిజన్లు, 53 పోలీస్ స్టేషన్‌లతో రాష్ట్రంలోనే పెద్ద జిల్లాగా అవతరించిందన్నారు. మన తిరుపతి జిల్లా ప్రపంచ ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వెలసిన తిరుమల క్షేత్రం, జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీకాళహస్తి, తిరుచానూరు, నారాయణవనం, నాగలాపురం, శ్రీనివాస మంగాపురం లాంటి పుణ్య క్షేత్రాలు, మన దేశానికే తలమాణికమైన శ్రీహరికోట అంతరిక్ష రాకెట్ కేంద్రం, శ్రీ సిటీ, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలతో కూడి వున్నది. 5 విశ్వవిద్యాలయాలతో, అనేక కళాశాలతో కూడి ప్రముఖ విద్యా కేంద్రంగా బాసిల్లుతున్నది. స్విమ్స్, రుయా హాస్పిటల్, బర్డ్సులతోనూ, అనేక కార్పొరేట్ హాస్పిటళ్లతో రాయలసీమ జిల్లాలకే కాక నెల్లూరు ప్రకాశం జిల్లాల నుంచి కూడా ప్రతి రోజూ వేలాధి మంది సదుపాయం కొసం వచ్చి పోతున్నారు. తిరుపతికి ప్రతి రోజు సుమారు 70 నుంచి 80 వేల మంది భక్తులు, విద్య, ఆరోగ్య సదుపాయాల కోసం సుమారు 20 నుంచి 30 వేల మంది వచ్చి పోతుంటారు. జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతను చేపడుతుంది. ఈ సంవత్సరం జరిగిన నేరాలను పరిశీలిస్తే పటిష్టమైన భద్రతతో తగ్గిన నేరాలు ఫోక్సో నేరాలు, నేర నియంత్రణలో పగక్బంది ఏర్పాట్లు, జిల్లాలో చాలా వరకు తగ్గాయని అన్నారు. నేరాలు 12101 రిపోర్టు కాగా 2022లో ఇప్పటికీ 9246 మాత్రమే రిపోర్టు కావడం జరిగింది. 87 శాతానికి పెరిగిన చార్జి షీటు శాతం కేసుల దర్యాప్తు త్వరగా ముగించి 876 శాతం మేరకు చార్జి షీట్లు వేయడం జరిగిందన్నారు. 2022 సంవత్సరంలో సమిష్టిగా పనిచేయడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టువేశామని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పి కులశేఖర్, అడిషనల్ ఎస్పి క్రైమ్స్ విమల కుమారి, సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, సెబ్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ స్వాతి, ఎస్‌బిడిఎస్ పి. సురేంద్ర రెడ్డి, నరసప్ప, మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## డెయిరీ పునఃప్రారంభించడానికి దశల వారీ పోరాటం

### రౌండ్‌టేబుల్ సమావేశంలో పాడి, రైతు సంఘ నాయకులు



చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

దీర్ఘకాలికంగా మూతపడ్డ చిత్తూరు సహకార విజయ డెయిరీని పునఃప్రారంభించడానికి దశలవారీ పోరాటాలకు సిద్ధం కావాలని రైతు సంఘ నాయకులు, పాడి రైతులు పిలుపునిచ్చారు. చిత్తూరు డెయిరీని ఆవరణలో గురువారం ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో డెయిరీని పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఏపి రైతు సంఘం కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జనార్ధన్, రైతు సంఘం నాయకులు హరిబాబు చౌదరి, భారీ సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత సిఎం జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే సహకార రంగానికి మహర్దశ పట్టిస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం ఇచ్చిన హామీని విస్మరించారని ధ్వజమెత్తారు. వందల కోట్ల రూపాయల విలువైన చిత్తూరు విజయ డైరీ ఆస్తులను కేవలం సంవత్సరానికి కోటి రూపాయల లీజుకు గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఆమూల్ సంస్థకు 99 సంవత్సరాల పాటు లీజుకు కేటాయించడం జిల్లాలోని పాడి రైతులను ప్రభుత్వం నట్టేట ముంచిందని ఆరోపించారు. 600 కోట్ల రూపాయల విజయ డైరీ ఆస్తులను ఆమూల్ సంస్థకు ఎలా కేటాయిస్తారని నిలదీశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ, సిపిఎం నాయకులు ఎస్.నాగరాజు, వి.గంగరాజు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి మునిరత్నం నాయుడు, ఎఐటియుసి నాయకులు మణి, గోపినాథ్, మోహన్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి విజయగౌరి, జమిలాబీ, గౌరి, జ్యోతి, రాజేశ్వరి, బాలాజీ, పెద్ద సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు.

## వెంకన్న దర్శనంతో ఆధ్యాత్మికానుభూతి

### -ప్రకృతిరమణీయతకు ముగ్ధుడైన జస్టిస్ చంద్రచూడ్





తిరుమల, డిసెంబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:

ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ తెలిపారు. తిరుమలలోని ప్రకృతి రమణీయత, పచ్చదనానికి జస్టిస్ చంద్రచూడ్ ముగ్ధులయ్యారు. ప్రధాన న్యాయమూర్తి హోదాలో జస్టిస్ డివై చంద్రచూడ్ తొలిసారిగా గురువారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి వెంకన్నను దర్శించుకున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి షోడషాభిషేకాలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన క్షేత్ర పాలకుడు గురుదక్షిణా మూర్తికి గురువారం విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కంచుగడప నుంచి ప్రవేశిస్తూనే మొట్టమొదట దర్శనమిచ్చేది. గురుదక్షిణా మూర్తి. ఇక్కడ దక్షిణామూర్తి క్షేత్రపాలకుడుగా విరాలజిల్లుతున్నారు. ఈ ఆలయం వద్ద ప్రతి గురువారం విశేష పూజలు అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ఇక్కడ గురుసంక్రమణ సందర్భంగా నిర్వహించే పూజలకు ఎంతో ఆదరణ ఉంది. తమిళ నాడునుంచి భక్తులు విశేష సంఖ్యలో వస్తారు. ఉభయదా రులుగా కూడా ఉన్నారు. ఇక్కడి ఆలయాన్ని భక్తుల భాగస్వామ్యంతో బంగారుతాపటం జరిపించారు. అంతేకాక గురువారం షోడషాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద భక్తులు వరుస కట్టారు. ఉదయం ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో గురుదక్షిణా మూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన గావించారు. హోమాలు నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రాల మధ్య స్వామి వారికి 108 దీపాల పర్వత హారతి, చక్రహారతి, కుంభ హారతి మహామంగళ హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఇన్సెపెక్టర్ హరియాదవ్, శ్రీనివాసరాజు, సురేష్, స్థానిక భక్తులు హాజరై నారు.

## టుటౌన్ ఇన్స్‌పెక్టర్‌గా భాస్కర్ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

చిత్తూరు టుటౌన్ ఇన్స్‌పెక్టర్‌గా భాస్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల టుటౌన్ పరిధిలో నమోదైన ఓ మాదక ద్రవ్యాల కేసులో ఇక్కడ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న యతీంద్రను ఎస్పీ రిశాంత్‌రెడ్డి వెకేన్సీ రిజర్వ్‌కు పంపారు. అప్పటి నుండి టుటౌన్ ఇన్స్‌పెక్టర్ కుర్చీ ఖాళీగా వుంది. ప్రస్తుతం చిత్తూరు క్రైం పోలీస్ స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న భాస్కర్‌ను టుటౌన్ పోలీస్ స్టేషన్‌కు ఇన్స్‌పెక్టర్‌గా నియమించడంతో ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

## బిటెక్ విద్యార్థులకు సెమినార్

చిత్తూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త:

సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం బిటెక్ విద్యార్థులకు హయ్యర్ ప్యాకేజీ సాధించడానికి 'రోడ్‌మ్యాప్' అనే అంశంపై గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటాచలపతి మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించుకోవడానికి తామను తాము అన్వేషించుకొని ముందుకు వెళ్ళాలన్నారు. కళాశాల ఛైర్మన్ కె.రంగనాథం, కార్యదర్శి డికె బద్రినారాయణ, సలహాదారులు డాక్టర్ కె.ఎల్.నారాయణ, శ్రీనివాస ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డిఎ కల్పజ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ, సిఎస్ఇ, సిఎస్ఇ(ఎఐఎంఎల్), సిఎస్ఇ(డిఎస్), ఇఇఇ, మెకానికల్, సివిల్, ఎంసిఎ, ఎంబిఎ విభాగాల అధిపతులు, చీఫ్‌ప్లేస్‌మెంట్ శిక్షణాధికారి తదితరులు పాల్గొన్నారు

## విద్యా ప్రమాణాలు పెంపొందించడమే లక్ష్యం

- ఎంపిపి హేమలతారెడ్డి

పెనుమూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఇందుకోసం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఎంపిపి మహాసముద్రం హేమలతారెడ్డి అన్నారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ ఆమె చేపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసీ దొరస్వామి యాదవ్, ఎంఇఓ కృష్ణారెడ్డి, హెడ్మాస్టర్ వెంకటేశ్వర నాయుడు, మండల వైకాపా కన్వీనర్ మహాసముద్రం సురేష్‌రెడ్డి, వైకాపా నాయకులు చక్రవర్తినాయుడు, గంధం ముని, ఈశ్వర్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, భూపతి నాయుడు, గుంటిపల్లి మురళి, ఎంపిటిసీ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి : ఎంపిడిఓ

పెద్దపంజాణి డిసెంబర్ 29 ప్రభాతవార్త :



మండలంలోని జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడీఓ తుటిక శ్రీనివాస్ విశ్వనాథ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీఇళ్లను పరిశీలించారు. లబ్దిదారులకు డ్వాక్రా సంఘాలచే గృహనిర్మాణం కోసం రుణాలు అందించి త్వరగావాటి నిర్మాణాన్ని లబ్దిదారులు పూర్తిచేసేవిధంగా చూడాలని ఆయన సూచించారు. ఇంకా ఇళ్లనిర్మాణాలు ప్రారంభించని లబ్దిదారులు వెంటనే గృహనిర్మాణాలు ప్రారంభించాలని సకాలంలో బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తోందని ఆయన పేర్కొన్నారు. అనంతరం పెద్దపంజాణి గ్రామసచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ఎంపిపి జి.డి.బాబు, వైకాపా జిల్లా కార్యదర్శి ఎ.తమ్మిరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరినాథ్, సర్పంచులు రవికుమార్, రమేష్‌బాబు, అఖిలాజాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## నీతిపద్యాలతో వ్యక్తిత్వ వికాసం పెంపుసాధ్యం

పలమనేరు డిసెంబర్ 29 ప్రభాతవార్త :



నీతి పద్యాలతో వ్యక్తిత్వవికాసం పెంపొందించుకోవడం సాధ్యమౌతుందని తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి.తులసినాథం నాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక గురుకుల పాఠశాలలో చదివే 5వ తరగతి విద్యా ర్థులకు నీతిపద్యాల పుస్తకాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతిపద్యాలు వ్యక్తిత్వవికాసాన్ని పెంచుతాయన్నారు. వంద పద్యాలు నేర్చుకున్న పిల్లలందరకు బహుమతులు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మజ, శీతారామయ్య, తాతయ్య, నరేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, డిసెంబర్ 29 ప్రభాతవార్త



పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పి.నిత్యహాసిని, అమరేష్ కుమార్‌రాయ్ అనే విద్యార్థులు ఈనెల 27వతేదీన జిల్లా స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిపోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ జె.ఈశ్వరయ్య మాట్లాడుతూ తమ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం ఎంతో సంతోషం అన్నారు. పి.నిత్యాహాసిని షార్ట్‌పుట్ విభాగంలోను, అమరేష్‌కుమార్‌రాయ్ షార్ట్‌పుట్ మరియు జావెలిన్ త్రో విభాగంలో ఎంపికవడం గర్వకారణం అన్నారు. ఈసందర్భంగా పిఇటి మేఘును అభినందించారు. కార్యక్రమంలో ఎజిఎం శ్రీనివాసులు, డీన్ సుబ్రమణ్యం, ఇన్‌ఛార్జిలు కల్పన, జానకి, ఎఓ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పున్నమి హోటల్‌లో మ్యూజికల్ హంగామా

కుప్పం, డిసెంబర్ 29 ప్రభాతవార్త



కుప్పం ఆఫ్‌హోం హోటల్స్ అండ్ రిసార్ట్స్( పున్నమి హోటల్)లో ఈనెల 31వతేది రాత్రి 7గంటలకు గొప్ప మ్యూజికల్ హంగామా నిర్వహిస్తున్నట్లు మేనేజర్ జయపాల్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి నటి ప్రియా ఆనంద్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. నూతన ఏడాది సందర్భంగా నృత్య, మ్యూజిక్ ప్రదర్శనలు, పిల్లలకు ప్రత్యేక ఆటల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే నెల్లూరు వంటరుచులు అయిన మాంసాహారం, శాఖాహారం భోజనాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ వేడుకలకు ఒక్కొక్కరికి 999రూ.లు, జంటకు 1799లు ఫీజు అని తెలిపారు. వివరాలకు 9703144440నెంబరును సంప్రదించాలని కోరారు.

## విద్యార్థుల భవితకు సిఎం జగనన్న బంగారుబాట

- మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పంరూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త



రాష్ట్రంలోని చదువుకుంటున్న విద్యార్థుల భవితకు సిఎం జగనన్న బంగారుబాట వేస్తున్నారని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక బాలుర, బాలికల, కస్తూరిబా గురుకులాల్లో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను నాడు -నేడు కార్యక్రమంలో సిఎం జగనన్న కార్పోరేట్‌కు ధీటుగా మార్చుతున్నారన్నారు. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, కౌన్సిలర్లు రంగయ్య, మోహన్‌రాం, గణపతి, నేతలు రాము, జయశంకర్, లోకేష్, ఎంఇఒ మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నాయిబ్రాహ్మణులకు కౌన్సిలర్ మణి ఇరవై వేల విరాళం

కుప్పంరూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త

మున్సిపల్ పరిధి లక్ష్మీపురం వార్డు కౌన్సిలర్ మణి మరోమారు తన ధాతృత్వాన్ని చాటారు. శ్రీసద్గురు త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవ వేడుకలకు సంబంధించి తనవంతుగా ఇరవై వేల విరాళాన్ని నాయిబ్రాహ్మణ కులస్తులకు అందించారు. అనంతరం కౌన్సిలర్ మణిని వారు ఘనంగా సత్కరించారు.

## మాజీ ఎమ్మెల్సీ గౌనివారిచే పెద్దఎత్తున అన్నదానం

కుప్పంరూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కుటుంబ సభ్యులచే గురువారం కుప్పంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు పిఎస్ సతీష్‌కుమార్, మహిళా నేత తిరుమగళ్, ఐటిడిపి నరేష్ పాల్గొన్నారు.

## జనవరి 15కల్లా గృహ సారథులను నియమించాలి

- ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం, డిసెంబర్ 29 ప్రభాతవార్త



జనవరి 15కల్లా గ్రామాల్లో గృహ సారథులను నియమించాలని ఎమ్మెల్సీ భరత్ సూచించారు. గురువారం స్థానిక ఎస్ఎల్‌వి కళ్యాణ మండపంలో జరిగిన వాలంటీర్లు, గృహ సారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం జగనన్న సంక్షేమ పథకాలు ప్రజల్లో తీసుకెళ్లే బాధ్యత నేతలు, కార్యకర్తలపై ఉందన్నారు. వాలంటీర్లు బాగా పనిచేస్తున్నారని కితాబునిచ్చారు. ఎంపి రెడ్డెప్ప మాట్లాడుతూ కుప్పంకు త్వరలోనే హంద్రీ-నీవా ద్వారా నీరు అందించడం తధ్యమన్నారు. కుప్పంలో భరత్‌ను గెలిపిస్తే మంత్రిని చేస్తానని సిఎం హామీ ఇచ్చారని ఇది గుర్తించి నేతలు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కుప్పంలో చంద్రబాబుకు ఓటమి ఖాయమన్నారు. సమావేశంలో ఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, దండపాణి, ఎవిజయరాం, రఘురాంరెడ్డి, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెక్షన్ ఇన్‌చార్జిలు పార్టీ బలోపేతంకు కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, డిసెంబర్ 29 ప్రభాతవార్త



సెక్షన్ ఇన్‌చార్జిలు తెదేపా బలోపేతంకు గ్రామస్థాయిలో కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక నందిగం కళ్యాణ మండపంలో జరిగిన శాంతిపురం క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్షన్ బాధ్యులు, నేతలు కలసికట్టుగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం సెక్షన్ ఇన్‌చార్జ్‌లుపైనే మాజీ సిఎం చంద్రబాబునాయుడు బాధ్యతలు పెట్టారన్నారు. వీరు సైనికుల్లా పనిచేయాలన్నారు. శిక్షణ తరగతులు ప్రతి పనిలో ఉంటాయన్నారు. సమావేశంలో నేతలు మనోహర్, సత్యేంద్రశేఖర్, త్రిలోక్, ఎన్‌డి నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, ఎల్.జయరాంరెడ్డి, చంద్ర, ఉయ్యాల జయరాంరెడ్డి, నాగరాజు, రాజు, ఈడిగ రమేష్, రాజారెడ్డి, నాగరాజు, దాము, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ, శ్యామలమ్మ, రూప తదితరులు పాల్గొన్నారు.

## తొలగించిన పింఛన్లు యధావిధిగా ఇవ్వాలి

యర్రావారిపాలెం, డిసెంబరు 29 ప్రభాతవార్త

మండలంలో అనర్హులుగా నోటీసులు అందించిన సుమారు 120 పెన్షన్లను వెంటనే పునరుద్ధరించాలని రాష్ట్ర బీసీ సాధికారత సమితి ప్రధానకార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు డిమాండ్‌చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా పెన్షన్ ఇచ్చి ఇప్పుడు తొలగించడం ఏమాత్రం న్యాయం కాదన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు దేశిరెడ్డిరఘునాథ, ప్రధానకార్యదర్శి మహేష్‌నాయుడు, సీనియర్ నాయకులు సిరివేళ రఘు, ఉపాధ్యక్షులు హరిశ్చంద్ర, చిన్నపరెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అర్హులందరికీ సంక్షేమమే లక్ష్యంగా అడుగులు

చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. చిత్తూరు రూరల్ మండలం తాళంబేడు గ్రామ సచివాలయ పరిధిలోని టి.మిట్టూరు గ్రామంలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసీ బాబునాయుడు, చిత్తూరు రూరల్ మండల అధ్యక్షురాలు గీతాసంపత్, మండల వైకాపా కన్వీనర్ త్యాగరాజు, సర్పంచ్‌లు భాస్కర్, అమరనాధరెడ్డిలు, ఎంపిటిసీలు ప్రతిమారెడ్డి, సుదర్శన్, బాబులు, తహసిల్దారు పార్వతి, సింగిల్‌విండో ఛైర్మన్ కన్నన్, నాయకులు కోటేశ్వరరావు, అరవింద్, పట్టాబి, ప్రసాద్, ధర్మముని, ప్రభాకర్, సుధీర్, హరినాధరెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## శవాలతో వైకాపా రాజకీయం

చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

కందుకూరులో గురువారం ఎనిమిది మంది దేశం కార్యకర్తలు మృతి చెందిన సంఘటనపై తెలుగుదేశం పార్టీ నాయకులు మొత్తం విషాదఛాయల్లో వుంటే అధికార వైకాపా శవ రాజకీయాలు చేస్తోందని తెలుగుదేశం నాయకులు ధ్వజమెత్తారు. చిత్తూరు దేశం పార్టీ కార్యాలయంలో గురువారం తెలుగుదేశం నాయకులు మోహన్‌రాజ్, సప్తగిరిప్రసాద్, మేషక్, సునీల్‌కుమార్ చౌదరి, ఎం.కుమార్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ బుధవారం జరిగిన సంఘటనను ప్రమాదంగా చూసి బాధిత కుటుంబాలను ఆదుకొనే శ్రద్ధ చూపకుండా అధికార వైకాపా శవ రాజకీయం చేస్తోందని విమర్శించారు. సమావేశంలో దేశం నాయకులు కృష్ణమూర్తియాదవ్, జైపాల్, సురేష్, ధరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

చిత్తూరురూరల్, డిసెంబరు 29 ప్రభాతవార్త:

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలో అపశ్రుతి జరిగి 8మంది కార్యకర్తలు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ రూ.15లక్షలు, పార్టీ నేతలు 9లక్షలు ఆర్థిక సహాయం ప్రకటించినట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకిటీల సురేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పేదల సంక్షేమమే జగన్ ప్రభుత్వ ధ్యేయం

తవణంపల్లె, డిసెంబర్ 29 ప్రభాతవార్త:



పేదల సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. గురువారం మండలంలోని మత్యం గ్రామ సచివాలయపరిధిలోనిదిగువ మత్యం, దిగువమత్యం ఎస్సీవాడ తదితర గ్రామాలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.హరిప్రసాద్‌రెడ్డి, తహశీల్దార్ సుశీల, వైస్ఎంపీపీపట్నంప్రతాప్‌రెడ్డి, వైకాపామండల కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి, నాయకులు సరకల్లు హరిరెడ్డి, తడకరమధుకుమార్, పరమేశ్వరరెడ్డి, వినోద్‌యాదవ్, అరగొండసందీప్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, అమరావతి, సుబ్రమణ్యంరెడ్డి, ఏపీఎం రవి, ఏపీఓ లలితలతోపాటుపలువురుప్రజాప్రతినిధులు, వివిధప్రభుత్వశాఖలఅధికారులు, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ఐరాల, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను గురువారం పంపిణీ చేశారు. పొలకల జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ఈట్యాబ్‌లను పాఠశాల హెచ్ఎం శాంతకుమారి, ఎం.పైపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో నాయకులు సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బీరప్ప చెరువు ఎంపీయుపీ స్కూల్‌లో స్థానిక ఎంపీటీసీ మమతా సురేంద్ర యాదవ్‌లు ట్యాబ్‌లను అందజేశారు.

## అర్ధగిరి హుండీల ద్వారా 14.95 లక్షలు ఆదాయం

తవణంపల్లె, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 14.95 లక్షలు రూపాయలు ఆదాయంగా లభించింది. గురువారం ఆలయ ఛైర్మన్ పి.సురేంద్రారెడ్డి, ఈఓ నూకా వెంకట సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు వారిచే హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈసందర్భంగా 120 రోజులకు గాను 14,95,945 రూపాయలు ఆదాయంగా వచ్చింది. అలాగే ఒక అమెరికన్ డాలర్ ఆదాయంగా వచ్చింది.

## క్యాలెండర్లు ఆవిష్కరణ

చౌడేపల్లి, డిసెంబర్ 29 ప్రభాతవార్త



రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా డిసిసిబి ఎస్సీ, ఎస్టీ, బిసిసంఘానికి సంబంధించిన క్యాలండర్‌ను ఆవిష్కరించారు. అంబేద్కర్ భవన నిర్మాణ వ్యవస్థాపకుడు బ్యాంకు రెడ్డెప్ప, రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు, కెవిపిఎస్ వాసు, ఎంపిటీసీ శ్రీరాములు, దళిత ఐక్యవేదిక నాయకులు శేఖర్, కృష్ణ, కూరపర్తి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## గూడలిలో గడప గడపకు ఎమ్మెల్యే

కోట, డిసెంబర్ 29 ప్రభాతవార్త



కోట మండలం గూడలి పంచాయతీలోని దక్షిణపాలం లో గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు గురువారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడున్నరేళ్ల కాలం లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలతో కూడిన బుక్‌లెట్‌ను ప్రజలకు అందజేశారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పల్లిముల్లు శ్రీనివాసులురెడ్డి, ఉపసర్పంచ్ పల్లిముల్లు విజయసారధిరెడ్డి, తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ భవాని, మండల వైసీపీ కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి, ఎన్‌డిసిసిబి డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిక

వాకాడు, డిసెంబర్ 29, ప్రభాతవార్త



వాకాడు మండలానికి చెందిన యువకులు బుధవారం జిల్లా బిజెపి అధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి సభ్యత్వం తీసుకున్నారు. వారిని జిల్లా అధ్యక్షుడు దయాకర్ రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గూడూరులో జరిగిన బిజెపి పార్టీ సమావేశంలో శ్రీనివాసులు, హరీష్, తేజ అనే ముగ్గురు బిజెపిలో చేరారు. రాబోవు రోజుల్లో వాకాడు మండలం నుంచి పలువురు బిజెపిలోకి రాబోతున్నట్లు బిజెపి సీనియర్ నాయకుడు పాపా రెడ్డి, పురుషోత్తం రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి సీనియర్‌నాయకుడుపనబాక, కోటేశ్వరరావు, వాకాడుమండలంబిజేపిఅధ్యక్షుడు కె. వల్లి ప్రసాద్‌లు ఉన్నారు.

## చంద్రబాబునాయుడు జిమ్మిక్కులను ప్రజలు నమ్మరు

- మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతా మోహన్

బాలాయపల్లి, డిసెంబరు 29, ప్రభాతవార్త:



మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిమ్మిక్కులను ప్రజలు నమ్మరని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతా మోహన్ తెలిపారు. మండలంలోని వెంగమాంబపురం యాచవరం దళితవాడలో భారత్ జోడో యాత్ర నిర్వహించి, ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను విస్మరించినట్లు ఆయన తెలిపారు. దళితులకు ఎలాంటి పథకాలు ఇవ్వనందు వలన పేదరికం అనుభవిస్తున్నట్లు తెలిపారు. 2024లో జరగబోయే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు జిమ్మిక్కు చేస్తున్నారని విమర్శించారు. బహిరంగసభలు పెట్టి ప్రజల ప్రాణాలు తీసే దానికన్నా చంద్రబాబునాయుడు ఇంటింటికి తిరిగి నా మాదిరి ప్రచారం చేయొచ్చని సూచించారు. ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వ పనితీరు ఉందని చెప్పారు. ఎమ్మెల్యే ఆనం తెలుగుదేశం పార్టీలో చేరేదానికన్నా కాంగ్రెస్ పార్టీలో చేరితే మంచిదని, ఈ పార్టీ అధికారంలోకి వస్తుందని సూచించారు. ఆయన వెంట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పంట శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా వరిపైరుకు ఎరువులు వాడరాదు

- ఏడిఏ నాగార్జునసాగర్

వెంకటగిరి, డిసెంబరు 29, ప్రభాతవార్త:

రైతులు వరిపై విచ్చలవిడిగా మందులు వాడరాదని ఏడిఏ నాగార్జునసాగర్ తెలిపారు. పలు గ్రామాల్లో ఆయన పర్యటించి వరిపైరు పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకే వరి పైరుకు యూరియా వంటి ఎరువులు వాడాలని తెలిపారు. ఎక్కువగా ఎరువులు వాడడం వలన నష్టం జరుగుతుందని తెలిపారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో సుజాత, సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలి

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట, డిసెంబర్ 29 ప్రభాతవార్త



ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని వాలంటీర్లు, కన్వీనర్లకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సూచించారు. గురువారం నాయుడుపేట పట్టణంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపికతో కలిసి వాలంటీర్లు, కన్వీనర్లతో ఎమ్మెల్యే సంజీవయ్య ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు ప్రజల వద్దకే పాలన అంటూ ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేసిన ఉదంతాలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం కొత్తగా నియమించిన కన్వీనర్లు పార్టీకి వారధిలా పనిచేసి, ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి లబ్ధిదారుడికి అందేలా చూడాలని సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు షేక్ రఫీ, వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్ దారా రవి, వైసీపీ నాయకులు కలికి మాధవరెడ్డి, కిషోర్ యాదవ్, చదలవాడ కుమార్, భవానిశంకర్ రెడ్డి, కటకం జయరామయ్య తదితరులు పాల్గొన్నారు

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి, డిసెంబర్ 29 ప్రభాతవార్త



అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందించే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఓజిలి మండలం గుర్రంకొండ గ్రామంలో గురువారం వైసీపీ నాయకులు వామనరాజు అధ్యక్షతన ఎమ్మెల్యే సంజీవయ్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వామనరాజు ఆధ్వర్యంలో భారీ గజమాలలతో, డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో ఎమ్మెల్యే సంజీవయ్యకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవయ్య గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో బత్తల సుబ్బారెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి శుద్ధి ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గడ్డం అరుణారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు, సర్పంచ్ ముప్పాళ్ల మాధవీలత, గుంటమడుగు వామనరాజు, తహశీల్దార్ డి.లాజరస్, ఎంపిడిఓ రజనీకాంత్, ఎస్ఐ డి.ఆదిలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుమన్‌రెడ్డి, బి.సుబ్బారెడ్డి, వైసీపీ నాయకులు ముమ్మడి సుబ్బారావు యాదవ్, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పాదర్తి హరినాథ్‌రెడ్డి, ఉచ్చూరు హరినాథ్‌రెడ్డి, కె.ఫణీంద్రరెడ్డి, దామోదర్‌రాజు, కోఆప్షన్‌సభ్యులు ఎస్‌కె ఖాదర్‌బాషా, ప్రసాద్‌నాయుడు, హౌసింగ్ ఏఈ, ఏపీఎం, ఏపీవో, విద్యుత్ శాఖ ఏఈ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కందుకూరు ఘటనను రాజకీయం చేస్తున్న వైసీపీ

వెంకటగిరి, డిసెంబరు 29, ప్రభాతవార్త:

కందుకూరు ఘటనను వైసీపీ వారు రాజకీయం చేయడం తగదని మాజీ ఏఎంసీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు తెలిపారు. కందుకూరు ఘటనలో మృతి చెందిన వారికి వెంకటగిరిలోని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాసంలో టిడిపి నాయకులు సంతాపం తెలిపారు. కందుకూరు ఘటనలో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ వారికి పార్టీ తరపున ఒకరికి పది లక్షల రూపాయలు మాజీ సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించినట్లు తెలిపారు. కాగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బహిరంగసభలో మృతి చెందిన వారు టీడీపీ హత్యేనని విమర్శించడం విచారకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు సత్యనారాయణ, మంకు ఆనంద్, చెంగారావు, తాండవ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 175 స్థానాల్లోనూ గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం : ఎమ్మెల్యే

కోట, డిసెంబర్ 29 ప్రభాతవార్త

రాష్ట్రంలో వైసీపీ 175 స్థానాల్లోనూ గెలుచుకొని మళ్లీ అధికారంలోకి వస్తామని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు ధీమా వ్యక్తం చేశారు. గురువారం కోటలోని షాదీమంజిల్‌లో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీని మరింత బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గృహ సారథులను, సచివాలయ కన్వీనర్లను తీసుకొచ్చారని చెప్పారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. తనకు లోకేష్ సమక్షంలో వందకోట్ల ఆఫర్ ఇచ్చినా తాను పార్టీ మారలేదన్నారు. తల్లిలాంటి పార్టీకి ద్రోహం చేయకూడదన్న ఉద్దేశ్యంతో జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడిచానన్నారు. ఈ సమావేశంలో వైసీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, ఎన్‌డిసిసిబి డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్య, యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణమ్మ, చిట్టేడు సొసైటీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్, గురుస్వామి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సంపత్‌కుమార్‌రెడ్డి సేవలు భేష్

కోట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే వరప్రసాదరావు చెప్పారు. గురువారం స్థానిక షాదీమంజిల్‌లో జరిగిన సమావేశంలో సంపత్‌కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా శాలువా కప్పి అభినందించారు. అంతకుముందు మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

## విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్న సీఎం

- ఎంపీపీ

వెంకటగిరి, డిసెంబరు 29, ప్రభాతవార్త:

విద్యాభివృద్ధికి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక ప్రార్ధన చేస్తున్నట్లు ఎంపీపీ తనూజారెడ్డి తెలిపారు. కలవలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యారంగంలో అధునాతన రంగానికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు. విద్యార్థులకు ట్యాబుల ద్వారా ఆన్‌లైన్ తరగతులు చూడవచ్చని తెలిపారు.

## ప్రభుత్వానికి వెన్నుముక వాలింటీర్లు

చిల్లకూరు డిసెంబర్ 29 ప్రభాతవార్త



దేశంలో ఎక్కడ లేని విధంగా మన రాష్ట్రంలో గ్రామ ప్రజలకు ప్రభు త్వానికి వెన్నుముకలాగా వాలింటర్లు పనిచేస్తున్నారని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ అన్నారు. గురువారం చిల్లకూరు ఎంపి డిఒ కార్యాలయంలో కన్వీనర్లు, వాలింటర్లతో సమావేశం నిర్వహించారు. ముందుగా చిల్లకూరులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం లోని 8 వతరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అదే విధంగా ఎమ్మెల్యే కార్యాలయంలో ముత్యాలమ్మ అమ్మవారి లక్ష్మీ నరసింహస్వామి నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యా ర్థులకు బంగారు భవిష్యత్తు బాటలు వేసేందుకు సిఎం జగన్‌మో హన్‌రెడ్డి ట్యాబ్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా వాలింటర్ల తోపాటు గ్రామ సచివాలయానికి కూడా కన్వీనర్లను నియమించడం వారి ద్వారా కూడా గ్రామ ప్రజలకు ప్రభుత్వానికి మధ వారదిలాగా పనిచేయడం సంతోషదాయకమని అన్నారు. ఎఎంసి ఛైర్మన్ ఓడూరు యమునమ్మ, జడ్పిటిసి మన్నెం శ్రీనయ్య, కన్వీనర్ పరంధామిరెడ్డి, సిఐ.దశరదరామా రావు, ఎస్ఐ బి.గోపాల్, వైసిపి నాయకులు ఎల్లంటి సనత్‌కుమార్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, మధు సూదన్‌రెడ్డి, ఎస్‌కె సంధానిబాషా, ఎంపిటిసిలు సర్పంచ్‌లు పాల్గొన్నారు.



2022 I.A.No.1
2022 I.I.M.O.P.No.164
VS
HMOP
09.01.2023
MB

# చీటీల పేరుతో కుచ్చుటోపీ!

సూళ్లూరుపేట, డిసెంబర్ 29 ప్రభాతవార్త : చీటీల పేరు చెప్పి గత కొన్నేళ్లుగా తెలిసినవారి వద్ద నుంచి లావాదేవీలు నిర్వహిస్తూ కుచ్చుటోపీ పెట్టి పరారైన ఓ కుటుంబం ఉదంతం సూళ్లూరుపేటలో గురువారం చర్చనీయాంశంగా మారింది. పట్టణంలోని రైల్వే క్యాబిన్ రోడ్డులో నివాసం ఉంటున్న పద్మావతి అనే మహిళ గత కొన్నేళ్లుగా ఇక్కడే నివసిస్తూ చీరల వ్యాపారం చేస్తూ పరిచయాలు పెంచుకుంది. ఈ నేపథ్యంలో తెలిసిన వారి వద్ద నుంచి చీటీలు వేసుకోవడం ప్రారంభించింది. గత కొన్నేళ్లుగా ఈ లావాదేవీలను కొనసాగిస్తూ వస్తోంది. ఈ క్రమంలో సుమారు రూ.12 కోట్ల వరకు చీటీల డబ్బులు సంబంధీకులకు ఇవ్వాల్సి ఉన్నట్లు చెప్తున్నారు. ఇదిలావుంటే ఈమె భర్త శ్రీనివాసులు పట్టణంలో చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. వీరి కుటుంబం గత 40 సంవత్సరాలుగా సూళ్లూరుపేటలో నివసిస్తున్నారు. వీరు కనిపించకుండా పోవడంతో ఈ విషయం తెలుసుకున్న కొంతమంది బాధితులు రైల్వేక్యాబిన్ రోడ్డులోని ఇంటికి వెళ్లి ఇంట్లో ఉన్న చీరలు, సామగ్రిని ఆటోల్లో, ఇతర వాహనాల్లో తరలించుకెళ్లిపోయారు. చేతికి అందినంత అందనీ అనే సామెతలాగా ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని కేసు నమోదు చేస్తామని తెలిపారు. నష్టపోయిన బాధితులు లబోదిబోమంటూ తాము రూ.5 లక్షలు నష్టపోయామని ఓ మహిళ, రూ.10 లక్షలు మోసపోయామని మరొకరు.. ఇలా ఒక్కొక్కరు చెప్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంమీద సూళ్లూరుపేట పట్టణంలో ఇటువంటి సంఘటనలు పరిపాటిగా మారాయి. ఏదో ఒక ప్రాంతంలో చీటీలు వేసుకోవడం, పరారీ కావడం వంటివి కొనసాగుతున్నాయి. పోలీసులు ఈ ఉదంతాలపై దృష్టి సారించి చీటీల వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇరకం, వేనాడు దీవుల్లో... నాలుగు బృందాలతో సమగ్ర భూసర్వే



తడ, డిసెంబర్ 29 ప్రభాతవార్త : తడ మండలం ఇరకం, వేనాడు దీవుల్లో సమగ్ర భూసర్వే జరుపుతు న్నారు. ఒక్కో దీవికి రెండు బృందాలు చొప్పున సర్వే బృందాలను పంపించినట్లు తహశీల్దార్ రామయ్య తెలిపారు. ఇటీవల భారీవర్షాలు కారణంగా ఈ దీవుల్లో సర్వే సకాలంలో నిర్వహించలేకపోయారు. ప్రస్తుతం మళ్లీ వాతావరణం అనుకూలించడంతో సర్వే బృందాలు దీవుల వైపు వెళ్లాయి. వేనాడు దీవిలోని ప్రధాన గ్రామంతో పాటు మూల, ఇరకం దీవిలోని ప్రధాన గ్రామంతో పాటు తిరువెంకటనగర్ తదితర చోట్ల కూడా సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సమగ్ర భూసర్వే కారణంగా దీవుల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కారమవుతాయని ఆయా గ్రామాల ప్రజలు భావిస్తున్నారు.

## చోరీ కేసులో ముగ్గురు అరెస్టు



పలమనేరు డిసెంబర్ 29 ప్రభాతవార్త : చోరీ కేసులో ముగ్గురు నిందితులను గురువారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సిఐ చంద్రశేఖర్ తెలిపారు. తస్థానిక పోలీస్‌స్టేషన్ నందు జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మే4వ తేదీన స్థానిక గాంధీనగర్‌కు చెందిన ప్రశాంత్ కుమార్ అతని ఏటీఎం ద్వారా రూ.1.15లక్షలు నగదును తీసుకోవడం జరిగిందని తీసుకున్న నగదును తన ద్విచక్రవాహనంలో ఉంచి ఇంటికి వెళ్ళగా అదమరచి ద్విచక్రవాహనంలోనే నగదు వదిలివేయడం జరిగిందని తెలిపారు. కొద్దిసేపటికి నగదును వాహనంలో వదిలిన విషయంగుర్తించి వాహనంలో నగదు చూడగా అప్పటికే నగదు చోరీ అయినట్ల గుర్తించి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనిపై కేసునమోదుచేసి విచారణ చేపడుతున్నక్రమంలో గురువారం కర్ణాటకరాష్ట్రం శివమొగ్గజిల్లా బద్రావతికి చెందిన సునీల్, విష్ణు, ఈశ్వర్‌లు మదనపల్లి రోడ్డులో ఓ ఏటీఎంవద్ద నగదు తీసుకుంటున్న వ్యక్తుల వద్దనుండి చోరీకియత్నిస్తుండగా అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వీరిని విచారించగా ప్రశాంత్ కుమార్ వద్ద నగదుచోరీ చేసిన విషయాన్ని అంగీకరించడంతో వారివద్దనుండి రూ.70వేల నగదు ఓ ద్విచక్రవాహనం స్వాదీనంచేసుకుని రిమాండుకు తరిలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగరాజు, క్రైంపార్టీ సిబ్బంది శ్రీనివాసులు, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన పోలీసు కుటుంబసభ్యులకు

### రూ. లక్ష కార్పస్ ఫండ్ అందజేత



చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త: పోలీసు విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతి చెందిన ఇద్దరు పోలీసు కుటుంబ సభ్యులకు గురువారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఒకొక్క కుటుంబానికి ఒక లక్షల రూపాయల కార్పస్ ఫండ్‌ను అందజేశారు. ఇటీవల పోలీసు విధులు నిర్వహిస్తూ కానిస్టేబుల్ ఎన్.మోహన్ నాయికర్, జయప్రకాష్‌లు మృతి చెందారు. ఈ మేరకు మృతి చెందిన జయప్రకాష్ భార్యకు ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఒక లక్ష రూపాయలు, మృతి చెందిన కానిస్టేబుల్ మోహన్ నాయికర్ సోదరికి ఒక లక్ష రూపాయల చెక్కును ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మృతి చెందిన పోలీసు కుటుంబాలను పోలీసు శాఖ అన్ని విధాల ఆదుకొంటుందని, ఎద్దైనా సహాయం అవసరం అనుకొంటే తనను కలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఓ కృష్ణమోహన్, అడిషనల్ ఎఓ దస్తగిరి, క్లర్క్ పార్థసారధి, చిత్తూరు పోలీస్ యూనియన్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా గెలుపే లక్ష్యంగా కలసి పనిచేద్దాం

### - ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్



కుప్పం, డిసెంబర్ 29 ప్రభాతవార్త : రాబోవు ఎన్నికల్లో వైకాపా గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కలసికట్టుగా పనిచేద్దామని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పిలుపునిచ్చారు. గురువారం వాలంటీర్లు, గ్రామ సారధులు, పార్టీ నేతలతో స్థానిక ఎంఎం మహల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో ఉన్నత ఆశయంతో సిఎం జగనన్న వాలంటీర్ల వ్యవస్థను అమలులోకి తెచ్చారన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలకు అందించి వాలంటీర్లు నిరుపమాన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు అన్నారు. వాలంటీర్లు ఇకపై గ్రామ సారధులతో కలసి పని చేయాలని సూచించారు. సిఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్, ఎంసి చైర్మన్ విద్యాసాగర్, కుప్పం పరిశీలకుడు రెడ్డెప్ప, ఎంపిపి అశ్విని మురుగేష్, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, సలహాదారు ఆర్. శ్రీనివాసులు రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వనిత శ్రీను, టౌన్‌బ్యాంక్ చైర్మన్ భాగ్యరాజ్ లు పాల్గొన్నారు. **కందుకూరు మృతులకు నివాళులు :** నెల్లూరు జిల్లా కందుకూరులో ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు సభకు హాజరై మృతి చెందిన వారి ఆత్మకు శాంతికలగాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. వైకాపా సమావేశంలో మృతుల ఆత్మకు శాంతికలగాలని రెండు నిమిషాలపాటు ఎమ్మెల్సీ భరత్, నేతలు మౌనం పాటించారు.

## సత్వరం గవర్నర్ల వ్యవస్థ రద్దు

### - అంబేద్కర్ విగ్రహం ఎదుట సిపిఐ నాయకుల నిరసన

చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేస్తోందని సిపిఐ నాయకులు ఎస్.నాగరాజు, టి.జనార్ధన్‌లు ధ్వజమెత్తారు. జాతీయ సిపిఐ కమిటీ పిలుపు మేరకు గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సిపిఐ నాయకులు దర్గా సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంబేద్కర్ రచించి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ దేశంలో కల్లోలం సృష్టిస్తోందని ఆరోపించారు. కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్లు దూకుడుగా వ్యవహరించి ఫెడరల్ స్పూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మణి, రత్నంనాయుడు, విజయగౌరి, జమిలాబీ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుపై కుప్పం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కుప్పం, డిసెంబర్ 29 ప్రభాతవార్త : నెల్లూరు జిల్లా కందుకూరులో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు సభకు హాజరై ఎనిమిది మంది మృతి చెందిన విషయం విదితమే. ఈ సంఘటనపై కుప్పం పోలీస్ స్టేషన్‌లో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుపై కుప్పం ఎంసి చైర్మన్ ఎస్ విద్యాసాగర్ గురువారం పోలీసులకు ఫిరా ్యదు చేశారు. సభలో ముందస్తు జాగ్రత్తలు పాటించక అమాయకుల మృతికి కారకులైన ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, నిర్వాహకులపై 304(పార్ట్2) కింద కేసు నమోదు చేయాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## అటవీ ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ టవర్లు మంజూరు : ఎం.పి



కుప్పం, డిసెంబర్ 29 ప్రభాతవార్త : కుప్పం, గుడుపల్లె మండలాల్లోని మారుమూల అటవీ ప్రాంతాల్లో కొత్తగా బిఎస్ఎన్ఎల్ టవర్లు మంజూరయ్యాయని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు నల్లకొండ గారి రెడ్డెప్ప పేర్కొన్నారు. కుప్పం , గుడుపల్లె ప్రాంతాల్లో సెల్ టవర్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్సీ భరత్ తన దృష్టికి తేగా ఈ అంశాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారి సహకారంతో కుప్పం మండలం అడవిబూదుగూరు, చిన్న ఒబ్బ, వెంకటేషపురం, కంగుందిలో రెండు, గుడుపల్లె మండలం పెద్దపర్తికుంటకు ఒక బిఎస్ఎన్ఎల్ టవర్లు మంజూరైనట్లు తెలిపారు.

## బాలికపై వాలంటీర్ అత్యాచారం! పోలీసులకు ఫిర్యాదు

శాంతిపురం, డిసెంబర్ 29 ప్రభాతవార్త : శాంతిపురం మండలం అబకలదొడ్డి పంచాయతీ పరిధిలోని వెంకటేష్‌పురం గ్రామంలో గ్రామ వాలంటీర్ శివయ్య ఐదో తరగతి చదువుతున్న ఓ బాలికపై అత్యాచారం చేశాడని బాలిక తల్లిదండ్రులు రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను చికిత్స నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించారు. బాలిక ప్రతిరోజూ తన గ్రామంలోని వాలంటీర్ ఇంటి వద్దకు వెళ్తుండగా అభంశుభం తెలియని ఆ బాలికపై వాలంటీర్ బుధవారం అత్యాచారం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గురువారం బాలిక విషయంను తల్లిదండ్రులకు తెలపడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మునస్వామి తెలిపారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘనంగా వీడ్కోలు

రేణిగుంట, డిసెంబరు 29 ప్రభాతవార్త: భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డా. ధనంజయ యశ్వంత్ చంద్రచూడకు రేణిగుంట(తిరుపతి) అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు లభించింది. గురువారం సాయంత్రం బయలుదేరారు. న్యాయమూర్తికి జిల్లా కలెక్టర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేశారు. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఏపీ హై కోర్టు లక్ష్మణరావు, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణరెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, 3వ అడిషనల్ జిల్లా జడ్జి వీరరాజు, ప్రోటోకాల్ మేజిస్ట్రేట్ కోటేశ్వరరావు, శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, అడిషనల్ ఎస్పీ కులశేఖర్, ప్రోటోకాల్ సూపరింటెండెంట్ ధనంజయనాయుడు, జిల్లా బార్‌కౌన్సిల్ ప్రెసిడెంట్ దినకర్ తదితరులు ఆయనకు వీడ్కోలు పలికారు.

## ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని ఎండగడదాం

– ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి –తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి

తిరుపతిరూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త: ప్రభుత్వ, నియంతృత్వ, నిరంకుశ ధోరణి ఎండగట్టాలని తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. –ఇదేమి ఖర్మ–మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని గురువారం రామానుజపల్లి, సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి తిరుపతిరూరల్ అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశ దోరణి వల్ల ప్రజలు విసిగిపోయారని ఆవేదన వ్యక్తం చేసారు. చంద్రబాబునాయుడు నిర్వహించిన రోడ్డు షోలో టిడిపి కార్యకర్తలు 8మంది మృతి చెందిన విషయం బాధకరమన్నారు. మృతులకు టిడిపి 23 లక్షల మేర నష్ట పరిహారం అందించి, బాధితుల కుటుంబాన్ని ఆదుకొంటుందన్నారు. మృతుల కుటుంబాలకు ఈశ్వర్‌రెడ్డి సంతాపాన్ని ప్రకటించారు. కేవలం తొక్కిసలాట వల్ల జరిగిన ప్రమాదాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు రాజకీయం చేయడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు విశ్వనాధరెడ్డి, మోహన క్రిష్ణ, మునిరత్నం, జయరామనాయుడు, చెంగారెడ్డి, బాలమునిరెడ్డి, జయరామయ్య, సుబ్బరామిరెడ్డి, పంచాయతీ, మండల నాయకులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో ఎఫ్ఆర్ఎస్‌లో అవకతవకలు

### బోధనేతర సిబ్బంది చేతివాటం- ఆందోళన బాటలో అకడమిక్ కన్సల్టెంట్ సంఘం నేతలు



తిరుపతి క్రీడ, డిసెంబర్ 29 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ఫేస్ రీడింగ్ అటెండెన్స్ బోధన సిబ్బందికి మాత్రమే తీసుకోవడం జరుగుతుంది. రాష్ట్రంలోని మిగిలిన అన్ని విశ్వవిద్యాలయాల్లో బోధిన, బోధనేతర సిబ్బంది అందరికీ కలిపి విద్యార్థులకు కూడా పేస్ రీడింగ్‌ని అటెండెన్స్‌గా తీసుకోవడం జరుగుతుంది. అయితే శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విచిత్రంగా కొంత మంది బోధన సిబ్బంది ఫేస్ రీడింగ్‌పై తమ అను నాయులకు చేతివాటం దర్శిస్తున్నారు. ఈ విషయంలో భారీ స్థాయిలో అవకతవకలు జరుగుతున్నట్లు వర్సిటీలో ప్రచారం జరుగుతుంది. ఈ విషయంలో అకడమిక్ కన్సల్టెంట్‌కు ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా ఫేస్ రీడింగ్‌లో డెసిగ్నేషన్లు మార్చడం జరుగుతున్న ఉన్నతాధికారులు కూడా చూసి చూడనట్లు పోతున్నారని అకడమిక్ కన్సల్టెంట్ సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది క్లర్కులు, ఏఏఓలు పరిపాలన భవనంలో తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. మరొ కొన్ని కాలేజీల్లో ఫేస్ రీడింగ్ ఇన్చార్జులుగా నియమించిన వారు కూడా తమకు నచ్చిన వారికి అనునాయలకి డిసిగ్నేషన్స్ పలు రకాలుగా పెడుతుండడం బాధాకరమని అకడెమిక్ కన్సల్టెంట్ అసోసియేషన్ నేతలు తీవ్రంగా మండి పడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొంటున్నారు. అంతేకాకుండా వర్సిటీలో పరిపాలన భవనం, వివిధ కళాశాలలోని ప్రిన్సిపల్ ఆఫీసులలో ఏళ్ల తరబడి పాతుకుపోయి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని నేతలు ఆరోపిస్తున్నారు. వెంటనే పేస్ రీడింగ్‌ని బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులకు అందరికి కూడా కంపల్సరీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే అకాడమిక్ కన్సల్టెంట్ల డిసిగ్నేషన్ ఉన్నతాధికారుల సూచన మేరకు అందరికీ ఒకే విధంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి, ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## శివయ్యను దర్శించుకున్న కర్నాటక మహిళా కమిషన్



శ్రీకాళహస్తి, డిసెంబర్ 29 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి కర్నాటక అతిధుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో గురువారం కర్నాటక మహిళా కమిషన్ చైర్మెన్ ప్రమీలా నాయుడు కుటుంబ సభ్యులతో విచ్చేసారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం చెప్పారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకున్న ఆమెకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందిం చారు. చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఆమెతో పాటుశివ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి బి.శాంతి దుర్గ ఉన్నారు.

## వర్షం వచ్చిందంటే పోలీస్ స్టేషన్ చెరువే!

### -కలగా మిగిలిపోతున్న సొంతభవనం



తొట్టంబేడు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : వర్షం వచ్చిందే చాలు తొట్టంబేడు పోలీస్‌స్టేషన్ చెరువుగా మారిపోతుంది. ఇటీవల మాండోస్ తుఫాను కారణంగా పోలీస్‌స్టేషన్‌లోకి మోకాలి లోతు నీరు చేరడంతో సిబ్బంది బెంచీలపై కూర్చోవడంతో పాటు కేసులకు సంబందించిన రికార్డులు కూడా తడిసిపోయాయి. ఇక్కడ పనిచేసే సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన నీటిని గిన్నెలు, బిందెలతో తోడిబయటకు పోయడం మనకు కనిపిస్తుంది. భారీ వర్షానికి తొట్టంబేడు పోలీస్‌స్టేషన్ జలమయం అయ్యింది. అయితే మాండూస్‌తుఫాను కారణంగా పోలీస్‌స్టేషన్‌లో చేరిన నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపించాల్సిన దుస్థితి కలిగింది. కార్యాలయం మొత్తం నీటితో నిండిపోవడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రివేళల్లో సెంట్రీ డ్యూటీ నిర్వహిస్తున్న సిబ్బంది రాత్రివేళల్లో ఇక్కడ ఉండాలంటే భయబ్రాంతులకు గురవుతున్నారు. లోపలకి ఓవైపు పాములబెడదతో ఎప్పుడు ఏపాము వస్తుందో, మరోవైపు ఎప్పుడు భవనం కూలిపోతుందో అని ఆందోళన వ్యక్తం చేస్తూ భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌కు కొత్తభవనం నిర్మించాలని స్థలం కేటాయించినా నిధులు లేకపోవడంతో నిర్మాణం మూలపడింది. జిల్లా ఎస్పీ మాత్రం కొత్త భవనాలను నిర్మించేందుకు నిధులు లేవంటూ చేతులెత్తేశారు. మరికూలిపోయిన తర్వాత కానీ కొత్తభవనం కట్టించలేరేమో మరి. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు కొత్త భవననిర్మాణానికి దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## శ్రీకాళహస్తీశ్వరాలయ కాలమానపట్టిక ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, డిసెంబర్ 29 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం 2023సంవత్సరానికి సంబందించి కొత్తగా రూపొందించిన కాలమాన పట్టిను ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు, ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి తనయుడు బియ్యపు ఆకర్షరెడ్డి, ఇఒ వికె.సాగర్‌బాబుల ఆధ్వర్యంలో దక్షిణా మూర్తి సన్నిధి వద్ద ఆవిష్కరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే సేవలు, సమాచారం భక్తులకు అందించాలనే లక్ష్యంతో ఈ ఏడాది క్యాలండర్‌లో సేవలు, పూజలు, భక్తులకు సదుపాయాల గురించి పొందుపరచామని వివరించారు. అంతేకాక స్వామి అమ్మవార్ల చక్కటి ఫోటోలతో కూడిన క్యాలెండర్‌ను సరికొత్తగా రూపకల్పన చేసామన్నారు. శ్రీకాళహస్తీశ్వరుని క్యాలండర్ ప్రతి ఇంటిలో ఉండేలా తీర్చిదిద్దామన్నారు. క్యాలండర్ ధర రూ.150గా ఖరారు చేసినట్లు చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు అందుబాటులో ఉండే విధంగా ఆలయాధికారులు చర్యలు తీసుకున్నారు. ఆలయ ఇఓ వికె సాగర్‌బాబు మాట్లాడుతూ తిరుమల తరహాలో శ్రీకాళహస్తీశ్వరుని క్యాలండర్‌ను భక్తులకు కావాల్సినన్ని క్యాలండర్‌లను అందు బాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యురాలు పసల సుమతి, ప్రత్యేకాహ్వానితులు జూలుగంటి సుబ్బారావు, వైకాపాకుచెందిన పాలమంగళం రవి, వెంకటసుబ్బయ్య, సెన్నీరు కుప్పం శేఖర్, గణేష్, పత్తిమణి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీ వైద్య కళాశాలలో ప్రెషర్స్ డే వేడుకలు



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త : ఎస్వీ వైద్య కళాశాలలో గురువారం ఘనంగా ప్రెషర్స్ డే అలైడ్ హెల్త్ సైన్సెస్ విద్యార్థులు నిర్వహించారు. ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డా. చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో తిరుపతి మొట్టమొదటి మేయర్ డా. శిరీష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ వైఎస్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో బిఎస్సీ, డిప్లమా కోర్సులు దాదాపు 30 వరకు ఈ వైద్య కళాశాలలో నిర్వహిస్తు న్నారని చెప్పడానికి చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా తెలిపారు. తాము చదువుతున్న రోజుల్లో ఇలాంటి కోర్సులుగాని డిప్లమాలు గానీ ఉంటే కాదు గాని ఇప్పుడు ఇలాంటి కోర్సులు వలన చాలా మెరుగైన వైద్యం అందించడానికి ఎంతో తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ప్రెషర్ డే సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ అడ్మిన్ డాక్టర్ వెంకట్, డాక్టర్ మునీశ్వర్ రెడ్డి, డా. రవి ప్రభు, ప్రత్యేక ఆహ్వానితులుగా బిఎస్సీ చదివిన ఈ కళాశాల విద్యార్థి సినీ హీరో జీవన్ రెడ్డి, నీలా రాణి, అలైడ్ హెల్త్ సైన్సెస్ విద్యార్థిని, విద్యార్థులు, కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

## యువకుడు అనుమానాస్పద మృతి!

రేణిగుంట, డిసెంబరు 29 ప్రభాతవార్త: రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తండ్లం పంచాయతీ ఓ విద్యాసంస్థ వెనుక బుజ్జి(38) అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ ధర్మారెడ్డి కథనం మేరకు... తిరుపతి బండ్ల వీధి ప్రాంతం ఎస్‌కే నగర్‌కుచెందిన బుజ్జి, శివకుమార్, నరేష్, మోహన్, కిషోర్‌లు చేపలు పట్టడానికి బుధవారం ఆటోలో మండలంలోని తండ్లం పంచాయతీ ఓ విద్యా సంస్థ వెనుక ఉన్న నీటికుంట వద్దకు వచ్చారు. వీరిలో ముగ్గురు చేపలు పడుతున్నారు. బుజ్జి ఉన్నట్టుండి పడిపోయి కాళ్లు, చేతులు గిలగిల కొట్టుకుంటున్నాడు. ఇది గమనించిన మిత్రులు కాపాడడానికి నీళ్లు తాగించారు. వెంటనే ఆటోలో ఇంటికి తీసుకెళ్లి పక్కనే ఉన్న ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులు అతను మృతి చెందినట్లు ధృవీకరించారు. గాజులమండ్యం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జన్మభూమి రుణంలో 'తానా'



బంగారుపాళ్యం, డిసెంబర్ 29 ప్రభాతవార్త: ఏ దేశంలో వున్నా జన్మనిచ్చిన దేశం కోసం తమ వంతు సేవా కార్యక్రమాలు చేస్తూ జన్మభూమి రుణం తీర్చుకొనే దిశగా 'తానా' వుందని తానా (ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్) అధ్యక్షుడు లావు అంజయ్య చౌదరి పేర్కొన్నారు. గురువారం బంగారుపాళ్యంలో తానా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పలు వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తానా అధ్యక్షులు అంజయ్య చౌదరి మాట్లాడుతూ 1977లో తానా ఏర్పడిందని అప్పటి నుండి పలు సంక్షేమ కార్యక్రమాలు తానా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు గ్రామాల్లో తానా ద్వారా పలు సేవా కార్యక్రమాలను ఆరోగ్య పరమైన సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది 15 కోట్ల రూపాయల విలువతో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. డిసెంబర్ 2 నుంచి జనవరి 5వ తేదీ వరకు తానా ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతుల కోసం రక్షణ కిట్లు, విద్యార్థుల కోసం చేయూత ద్వారా స్కాలర్‌షిప్‌లు, వికలాంగులకు ఆధరణ ద్వారా త్రిచక్ర వాహనాలు, మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పలు గ్రామాల్లో స్వచ్ఛ తాగునీరు కోసం మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అన్నపూర్ణ కార్యక్రమంలో భాగంగా గుంటూరు, తెనాలి, విజయవాడ ఆసుపత్రుల్లోని రోగులకు ఉచితంగా భోజన సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా బంగారుపాళ్యంలో విద్యార్థులకు సైకిళ్ళు, రైతులకు వ్యవసాయ పరికరాలు, వికలాంగులకు సైకిళ్ళు అందించారు. ఈ కార్యక్రమంలలో ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, జిల్లా టిడిపి అధ్యక్షుడు పులివర్తినాని, తానా కో–కన్వీనర్లు సునీల్, ఈదల మోహన్, హేమంత్‌కుమార్, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు జయప్రకాష్, జనార్దన్, మండల తానా చైతన్య స్రవంతి కన్వీనర్ భాష్యం వంశీకృష్ణ, టిడిపి నాయకులు కోదండయాదవ్, కోకా ప్రకాష్‌నాయుడు, నాగరాజునాయుడు, జయచంద్రనాయుడు, రహ్మతుల్లా, రమేష్, సూరినాయుడు, ఎల్‌వి సుభాష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నాక్ బృందం పర్యటన



తిరుపతి (విద్య), డిసెంబర్ 29 ప్రభాతవార్త : పద్మావతి మహిళా యూనివర్సిటీలో మంగళవారం నుంచి మొదలైన మూడు రోజుల నుండి జరుగుతున్న నాక్ కమిటీ పర్యటన గురువారం ముగిసింది. గురువారం కమిటీ చైర్మన్ డా. ముత్తుక లింగం కృష్ణన్ సభ్యులతో కూడిన బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా జరిగిన ప్రజెం టేషన్స్, డిపార్ట్మెంట్స్ పరిశీలిన యూనివర్సిటీలో ఉన్న అన్ని కామన్ సెక్షన్స్, అన్నింటి యొక్క అబ్జర్వేషన్స్ సంయుక్తంగా క్రోడి కరించి దానికి అనుగుణంగా రిపోర్ట్ ప్రిపేర్ చేసి నాక్ పోర్టల్‌కి అప్లోడ్ చేయడం జరిగింది. తర్వాత మూడు గంటలకు యూనివర్సిటీలో ఉన్న సావేరి సెమినార్ హాల్‌లో ఆరు గంటలకు నాక్ బృందంతో ఎగ్జిట్ మీటింగ్ జరిగింది. ఎస్‌పిఎంవివి వైస్ ఛాన్సిలర్ ప్రొఫెసర్ జమున మాట్లాడుతూ నాక్ టీంకు ధన్యవాదములు తెలిపారు. క్రిటికల్ ఎవల్యూషన్ ఇచ్చి ఫ్యూచర్ రోడ్ మ్యాప్ క్రియేట్ చేశారన్నారు. వారు ఇచ్చిన ఎవాల్యుయేషన్, ఫీడ్బ్యాక్ దిశా నిర్దేశం చేస్తుందని తెలిపారు. డా. ముత్తుక లింగం కృష్ణన్ మాట్లాడుతూ ప్రతి సంస్థలో పాజిటివ్, నెగిటివ్స్ ఉంటాయని అన్నారు. ఈ యూని వర్సిటీకి చాలా మంచి ప్రాజెక్టు ఫండింగ్స్ వచ్చాయి అన్నారు. నాక్ పోలీస్ ఆర్‌వాచ్డగ్ కాదని తెలిపారు. స్టూడెంట్స్‌ను గ్లోబల్ స్టాండర్డ్స్‌కు తయారు చేయాలని తెలిపారు. పబ్లికేషన్‌ను ప్రొడక్ట్స్ కింద కన్వర్ట్ చేయాలని అన్నారు. సస్టైనబిలిటీ చాలా ముఖ్యమని అన్నారు. ఈ విధంగా న్యాక్ టీం చైర్ పర్సన్ డా. ముత్తుక లింగం కృష్ణన్ అధ్యాపకులను, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను ఉద్దేశించి ఈ ఎగ్జిట్ మీటింగు ముగించారు. ఉపకులపతి ఆచార్య దువ్వూరి జమున, రిజిస్టర్ ప్రొఫెసర్ డి.ఎం. మమత, వివిధ విభాగాల డీన్లు, ఐక్యుఏసి సభ్యులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

**I, JAMA LAXMI DEVI** (Old Name) R/o 4/169, Buchi reddypalem, Gopavaram Mandal, YSR Dist.A.P. Have changed my name as **CHALLA LAKSHMIDEVI** (New Name), Wo **CHALLA NARASIMHULU.**

**CHANGE OF NAME**

**I, JAMA SYAM BABU** (Old Name) R/o 4/169, Buchi reddypalem, Gopavaram Mandal, YSR Dist.A.P. Have changed my name as **CHALLA NARASIMHUAU** (New Name), Wo **CHALLA PENCHALAIAH**

**CHANGE OF NAME**

**I, JAMA LAKSHMI** (Old Name) R/o 6-7-246, Vidyanagar, Badvel, YSR Dist.A.P. Have changed my name as **BATHALA LAKSHMI** (New Name), Wo **BATHALA SIVA PRASAD (New Name)**

**పాస్‌పోర్ట్ దారపోయింది**

దక్కిలి మండలం దగ్గవోలు గ్రామం నుండి వెంకటగిరికి **24.12.2022**న ప్రయాణించినాను. నా వెంట నా యొక్క లగేజీ బ్యాగ్‌లో నా ఆధార్ కార్డు ఒరిజినల్ **516803 939478** మరియు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం: దబ్ల్యు **3120544**. ఈ యొక్క లగేజీ బ్యాగ్ సదరు వెంకటగిరి బస్టాండ్ (కొత్తది)లో పోయినది. ఏవరికైనా దొరికి వుంటే నాకు చేర్చవలసినదిగా విన్నవించుకుంటున్నాను, డి.శ్రీనివాసులు, ఫోన్ నెం: **7780525188.**